**కథ**

# అబ్బాయి పెళ్లి

**జె.సరస్వతి**

తుపాను తర్వాత వుండే ప్రశాంతత లాంటి నిశ్శబ్దం అలముకొని వున్నదా గదిలో. అందరి మొహాల్లోనూ అలసట...దాని వెనుక తమ మాటే నెగ్గుతుందన్న ధీమా.

ఎవరికి వారికి ఆ ఆలోచన టానిక్కులా పనిచేసి ఇంతవరకూ హోరాహోరీగా జరిగిన వాగ్యుద్ధం లేదా వాగ్వివాదం వలన కలిగిన నీరసాన్ని జయింపజేసి నూతనోత్సాహాన్ని కలిగిస్తోంది.

ఈసారి అటో ఇటో తేలిపోవాలన్నదే వారి నిర్ణయం.

గత నాలుగేళ్లుగా ఒకరికి నచ్చితే మరొకరికి నచ్చక తప్పిపోతున్న రాజాచంద్ర పెళ్లి సంబంధాల గురించే ఇంతవరకూ జరిగిన రభస.

ఇంటా బయటా చర్చనీయాంశంగా, వినోద విషయంగా మారిందతని పెళ్లి. పెళ్లిళ్ల పేరయ్య కూడా విసుగు చెందని విక్రమార్కుడిలా శ్రమిస్తూనే వున్నాడు పాపం!

"అన్నయ్య ఎవరిని చేసుకున్నా నాకేం అభ్యంతరం లేదు. ఆడబడుచు కట్నంతోపాటు వెండి పానకం బిందె, కంచిపట్టుచీర పెట్టే వాళ్లయితే చాలు. మీరు సరిగా పెట్టుపోతలు జరపరని తెగ సాధిస్తుంది మా అత్తగారు. వీడి పెళ్లితో ఆవిడ నోరు మూతపడాలి" చెల్లెలి ప్రతిన.

"తన కొడుకేం అల్లాటప్పా పిచ్చిపుల్లయ్యా! ఆరడుగుల అందగాడు. అరవై వేల జీతగాడు. అనంతరామయ్యగారి సంబంధం ఖాయపరుస్తాను. అందం కొరుక్కుతింటామా! అది ఎల్లకాలం నిలబడేదా! డబ్బులోనే వుంటుంది మహత్యమంతా. ఈ రోజుల్లోనే కాదు ఏ రోజుల్లోనైనా సరే డబ్బున్నవాడు చెప్పిందే వేదం. డబ్బున్నవాడు ఏం చేసినా చెల్లుతుంది. వాడినే తెలివైనవాడని, గుణవంతుడని, సమర్థుడని కీర్తిస్తుంది లోకం. పది లక్షల రొక్కం కాక వంద తులాల బంగారం పెడతారు. పైగా ఘనమైన మర్యాదలు చేస్తారు. ఇంతకన్నా ఏం కావాలిటా! నా కొడుకు..ఇంతవరకూ నేను గీచిన గీటు దాట లేదు. ఇకముందు దాటడు" సుబ్బరాజుగారి కంచుకంఠం ధాటికి ఎదురు ఎవరు నిలబడగలరు?

ఆ మాటకొస్తే పార్వతమ్మగారేం తక్కువ తినలేదు. ముప్పయ్ ఏళ్లుగా ఆయనతో నెగ్గుకొస్తున్నదంటే, అంత కన్నా కొలమానం ఏం కావాలి! అందుకే ఫేడీమని జవాబిచ్చింది.

"ఆ జీడిపిక్క రంగు, ఎత్తుపళ్లకోతీనా నా కోడలు.. వీల్లేదుగాక వీల్లేదు. మగరాయుడులా పెరిగింది. ఇటు పుల్ల తీసి అటు పెట్టదు. దాన్ని చేసుకుంటే వాడి జీవితం నరకమే. డబ్బు కడుక్కు తాగుతామా! ఇవాళుంటుంది. రేపుపోతుంది. పొబ్బిడిగా సంసారం చేసుకునే తెలివి తేటలుండాలి గాని. లక్షణమైన పిల్ల. నా తమ్ముడు కూతురుండగా కట్నానికి ఆశపడి బయట సంబంధాల కెళ్లడం ఎంత సిగ్గుచేటు! నాకు ఎదురు చెప్పి ఎరగడు వాడు. 'నీకు నచ్చితే చాలమ్మా' అన్నాడు మొన్న వచ్చినప్పుడు కూడా" భర్తవైపు చుర చుర చూస్తూ చురకలే



సింది పార్వతమ్మగారు.

"లక్షల కట్నాలూ, పనిపాటలు చేతనవడం కాదు. ఈ రోజుల్లో ఆడపిల్లకుండాల్సింది అందం, చురుకూ, తెలివి. భార్యాభర్తలు కలిసి షికారెళ్లినా పార్టీలకెళ్లినా నలుగురూ చూసి మెచ్చుకునేలా వుండాలి. పనిదేముంది రెండొందలు పారేస్తే చేసి పెడతారు ఎవరు బడితేవాళ్లు. రాజుకి నేనంటే ఎంతో అభిమానం. 'నీకు నచ్చిన పిల్లను చూడు వదినా. కళ్లు మూసుకుని తాళి కడతాను' అన్నాడు ఎన్నోసార్లు. ఆ మాట మీదేగా మా పిన్ని కూతురు వనజాక్షిని చేసుకుంటామని మాట యిచ్చాను. దేవలోకం నించి దిగి వచ్చిన అప్సరస కదూ అది" ఇది కోడలు కామేశ్వరి వాదం. సన్న సన్నగా సన్నాయి నొక్కుతూనే అయినా దీటుగానే చెప్పింది అత్త మామలకు తీసిపోకుండా.

పాపం! రాఘవరావే మాటకారి కాకపోవడంతో- అంటే పెళ్లయ్యాక తన అభిప్రాయాలను వెలిబుచ్చవలసిన అవసరం తగ్గిపోవడంతో మాటలు మర్చిపోయిన కారణాన సరైన భాష వుపయోగించలేక పోవడంతో అతని వాదం బలహీనంగా మారి నిరసనకు గురైంది.

"మా అమ్మాయిని మీ తమ్ముడు వరిస్తే, మేనేజరు పదవి నిన్ను వరిస్తుందోయ్ రాఘవరావ్..మరి నీదే ఆలస్యం..ఆలోచించుకో" అన్నాడు ఆఫీసరు. ఏ రోజూ ఏదో ఒక విషయం మీద ముక్క చివాట్లు పెట్టే ఆయన తమ్ముడిని చూసిన దగ్గర్నించీ తనకి అతి మర్యాద చేస్తున్నాడు. దానితో మిగిలిన స్టాఫంతా వచ్చినట్లు తనని గౌరవంగా చూస్తున్నారు వేళాకోళాలు, వెక్కిరింతలూ మాని. తమ్ముడికి తనంటే వల్లమాలిన గౌరవం, అభిమానం. త్రేతాయుగంలో లక్ష్మణస్వామికే చెల్లింది. ఈ యుగంలో తన తమ్ముడు రాజాచంద్రకే చెల్లిందీ భాతృప్రేమ. ఎన్నాళ్లు చేసినా ఎదుగూ బొదుగూ లేని గుమస్తా పదవి నుండి ఒక్కసారిగా వాళ్లన్నయ్య మేనేజరు అవుతాడంటే వాడికంతకంటే ఏం కావాలి! ఇది తన మీదున్న గౌరవాభిమానాలకు గీటురాయి అని కూడా నొక్కి వక్కాణించాడు. మొన్నామధ్య వచ్చినప్పుడు "చూస్తూ వుండండి వాడు ఎవరిని చేసుకుంటాడో.." సవాలు చేశాడు రాఘవరావు.

వాకిట్లో టాక్సీ ఆగిన చప్పుడు హోరాహోరీ వాదులాడుకుంటున్న కుటుంబ సభ్యులంతా నిశ్శబ్దమై పోయి ప్రశ్నార్థకంగా చూడసాగారు.

కారు డోరు తీసుకుని దిగిన రాజాచంద్రను చూస్తూనే వాళ్ల మొహాలు చాటంతయ్యాయి.

"రా సుధా! ఇదే మా యిల్లు" అంటూ తన వెనకే దిగిన యువతిని తీసుకుని గుమ్మం దగ్గరకొచ్చాడు.

నోళ్లు తెరచుకుని చిత్తరువుల్లా నిలబడ్డ వాళ్లందరినీ చూస్తూనే వినయం ప్రకటిస్తూ, చిరునవ్వులు చిందిస్తూ అన్నాడు. "అందరూ ఇక్కడే వున్నారు కాబట్టి నాకు చాలా శ్రమ తగ్గినట్లే..ఈమె నా భార్య సుధ. ప్రొద్దున్నే రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నాం.."

"ఆ..ఎంత ధైర్యం! మేము చచ్చామనుకున్నావా!" రంకెలేశాడు తండ్రి.

"మరీ అంతగా ఆవేశపడకండి, గుండెపోటు రావొచ్చు లేదా బి.పి. పెరిగి మరేదైనా కావొచ్చు"

కొడుకు మాటలు మధ్యలోనే తుంచింది తల్లి "చాలుగాని నోరు మూసుకోరా! ఎన్నెన్ని ఆశలు పెట్టుకున్నాం నీ మీద. మాకు చెప్పే పనిలేదా?" రుద్ధకంఠంతో నిష్ఠూరమాడింది.

"అమ్మా, నెపమంతా నామీద వెయ్యకు. పెద్దల మీద నాకున్న గౌరవం కొద్దీ నా పెళ్లి బాధ్యత మీ ఇష్టానికే వదిలేశాను. కానీ మీరు చేస్తున్నదేమిటి..."

"అందుకని, మాకు మాట మాత్రమైనా చెప్పకుండా చేసుకుంటావా! మేం కన్న కలలన్నీ ఏం కావాలి?" ఉక్రోషంగా అడిగాడు రాఘవరావు. గత పది రోజులుగా మేనేజరులాగే హోదా చూపిస్తున్నాడు తన ఆఫీసులో.

"మీరు కన్న కలలు పెట్టుకున్న ఆశలు తీరాలంటే నేను విధిగా ఇద్దరినో ముగ్గురినో చేసుకోవలసి వస్తుంది. అప్పుడు మేం కాపురం చేసేది జైల్లోగాని ఇంట్లో కాదు. ఇవన్నీ బాగా ఆలోచించి ఒకరి కోరిక తీరి మరొకరి కోరిక తీరలేదన్న బాధ లేకుండా వుండదానికే ఏరికోరి సుధని చేసుకున్నాను.

నాన్న కోరిక మేరకు వీళ్ల నాన్న కట్నం రూపంలో లక్ష పైసలు కూడా ఇవ్వలేదు. చిన్నమెత్తు బంగారం కూడా పెట్టలేదు. అమ్మకు పుట్టింటి బంధువూ కాదు. వదిన కోరిక తీరేలా అందాల రాణీ కాదు. అన్నయ్యకు ప్రమోషను కాదుగదా, ఇంక్రిమెంటయినా ఇప్పించగల పలుకుబడీ లేదు వీళ్ల నాన్నకు. ఇహ చెల్లాయికి వెండిబిందె మాట దేవుడెరుగు వెండి ఉగ్గు గిన్నె కూడా కొని పెట్టలేని పేదవాళ్లు. అంచేత సుధ తప్పనిసరిగా మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. రమ్మంటే ఇంట్లో కొస్తాం. పొమ్మంటే కారు రెడీగా వుంది. ఐదు నిమిషాల్లో మీ నిర్ణయం ప్రకటిస్తే బాగుంటుంది. మరీ ఆలస్యం చేస్తే వెయిటింగ్ చార్జెస్ ఎక్కువ ఇవ్వవలసి వస్తుంది" దీర్ఘంగా ఊపిరి తీస్తూ ముగించాడు రాజాచంద్ర.

'పొమ్మంటే..వాళ్ళకేం యమదర్జాగా కాపురం చేసుకుంటారు. అటు కట్న కానుకలూ పోయి ఇటు కొడుకు జీతమూ పోగొట్టుకుంటే ఎలా' సుబ్బరాజుగారి బుర్ర కంప్యూటర్ కన్నా వేగంగా లెక్కలేసింది. గుమ్మానికి అడ్డు తొలగి దారి ఇచ్చాడు.

ఇంటి పెద్దను అనుసరించి పక్కకు తొలిగారు మిగిలిన సభ్యులు.

## గతవైభవం వచ్చేనా?

మళ్లీ హీరోయిన్‌గా గతవైభవాన్ని ఆశిస్తున్న సిమ్రాన్- పెళ్లి చేసుకుని పిల్లాడి తల్లి కూడా అయ్యాక అలాంటి ఆశలు పెట్టుకోవడం కొంచెం అత్యాశే అనుకోవచ్చు కదా! ఎందుకంటే సినిమా రంగంలో పెళ్లయిన హీరోయిన్ పట్ల వుండే ఇమేజే వేరు! వయసు ఎంత మీరకపోయినా కూడా ఆమె ఆంటీ కిందికే వస్తుంది ప్రేక్షకుల, ఫీల్డు దృష్టిలో. అయితే 'జాన్ అప్పారావు ఫార్టీ ప్లస్' సినిమాలో కృష్ణభగవాన్‌కి జోడీగా నటిస్తున్న సిమ్రాన్ లావుగా కనిపించినా చూడముచ్చటగానే వుందనేది ఇండస్ట్రీ వర్గాల టాక్. కాస్త స్లిమ్ గనక అయితే సిమ్రాన్‌కి మరికొన్ని హీరోయిన్ చాన్సులు వచ్చే అవకాశాలున్నాయంటున్నారు.

